నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 24 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

స్కాలర్‌షిప్ కోసం దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 23 : స్కాలర్ షిప్ కోసం అర్హులైన దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ అధికారి శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్, టాప్‌క్లాస్‌లకు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు, తమ స్కాలర్‌షిప్‌ను రెన్యూవల్ చేసుకోదలుచుకున్న దివ్యాంగ విద్యార్థులు www.depwd.gov.in, www.scholarships.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 9వ, 10వ తరగతి, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, టాప్ క్లాస్ స్కాలర్‌షిప్ కోసం డిగ్రీ, పీజీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

27న యాదగిరి గుట్టకు గవర్నర్

యాదగిరిగుట్ట, ఆగస్టు 23: ఈ నెల 27న యాదగిరి గుట్టకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కుటుంబ సమేతంగా రానున్నారు. లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా స్వామివారి చెంతకు వస్తున్నారు.

అప్పు చెల్లించేందుకు మళ్లీ అప్పు!

రుణమాఫీ రాని రైతులు ఇప్పటికే తీవ్ర ఆందోళనలో ఉండగా, ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెట్టి మరింత ఇబ్బందుల పాలు చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. వ్యవసాయ అవసరాలకు రెండు లక్షలకుపైన రుణం తీసుకున్న వాళ్లు 2లక్షలకు పైన ఉన్న డబ్బును తిరిగి చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని తిరకాసు పెట్టడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. పైనగదును చెల్లించేందుకు చేతిలో డబ్బు లేక మిత్తికి తెచ్చుకుంటున్నారు. తీసుకున్న అప్పు మాఫీ చేయించుకునేందుకు కొత్త అప్పు చేయాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ)

రుణమాఫీపై సర్కారు నిర్వాకంతో రైతన్న ఆగమాగం

రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉంటే మాఫీ చెయ్యట్లే

- పై డబ్బులు చెల్లిస్తేనే వర్తిస్తుందని తిరకాసు
- చేసేది లేక అప్పులు కట్టేందుకు రైతుల కష్టాలు
- ప్రైవేట్‌లో వడ్డీకి తెచ్చి చెల్లిస్తున్న వైనం
- ఇప్పటి వరకు గ్రీవెన్స్‌కు 1,074 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతలుగా రుణ మాఫీ చేస్తున్నది. జిల్లాలో తొలి విడుతలో 36,483 మంది, రెండో విడుతలో 17,991మంది, మూడో విడుతలో 13,011మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించింది. వారిలో దాదాపు 30శాతం మందికి పైగా రుణమాఫీ కాలేదు. ఇందుకు అధికారులు మాత్రం అనేక కారణాలు చెబుతున్నారు. జాబితాల్లో పేర్లు ఉన్నా ఖాతాల్లో మాత్రం డబ్బులు జమ కాలేదు. ఇక మూడో విడుతలో రూ. 1.50 లక్షల నుంచి రూ. 2లక్షల వరకు మాఫీ చేయాలి. ప్రభుత్వం మాత్రం రూ. రెండు లక్షల లోపు ఉన్న వారికి మాత్రమే మాఫీ చేస్తామని కొర్రీ పెట్టింది. అంతకంటే ఎక్కువ ఉన్న వారికి మాఫీ చేయబోమని స్పష్టం చేసింది. అయితే పైన అమౌంట్‌ను రైతులే చెల్లించాలని తిరకాసు పెట్టింది. సదరు మొత్తాన్ని చెల్లించాకే ప్రభుత్వం చెప్పిన రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామంటున్నది. దీంతో జిల్లాలో వేలాది మందికి రుణమాఫీ కాలేదు. అయితే ప్రభుత్వం పైన డబ్బులు వదిలేసి మిగతా అమౌంట్‌ను మాఫీ చేయొచ్చని వాదనలు కూడా ఉన్నాయి. సర్కారు ఉద్దేశపూర్వకంగా తిరకాసు పెట్టి.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రుణమాఫీ వివరాల కోసం ఆత్మకూర్.ఎం గ్రామీణ వికాస బ్యాంకుకు వచ్చిన రైతులు

రుణమాఫీకి తప్పని తిప్పలు

బ్యాంకులో టోకెన్ విధానం

ఆత్మకూర్.ఎం : రుణమాఫీ వివరాలను తెలుసుకునేందుకు రైతులు రోజూ బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగలేక తిప్పలు పడుతున్నారు. ఆత్మకూరు(ఎం)లోని గ్రామీణ వికాస బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు రుణ మాఫీ కోసం శుక్రవారం వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్యాంకు అధికారులు మాత్రం టోకెన్ సిస్టం పెట్టి రోజూ 30నుంచి 40 మంది రైతులకే అనుమతి ఇస్తున్నారు. దాంతో మిగతా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని పరిస్థితుల్లో వడ్డీలకు తెస్తున్న రైతులు

రెండు లక్షలకు పైన అమౌంట్ కడితేనే మాఫీ చేస్తామని సర్కారు తేల్చడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పెట్టుబడి కోసం తంటాలు పడుతున్నారు. మరోవైపు రైతు భరోసా కింద ఎకరానికి రూ. ఏడున్నర వేలు కూడా ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో మాఫీకి అర్హత పొందేందుకు రైతులు బయటకు అప్పులు చేస్తున్నారు. ప్రైవేట్‌లో రెండు, మూడు రూపాయల మిత్తికి తెచ్చి బ్యాంకులో మిగిలిన అమౌంట్‌ను క్లియర్ చేస్తున్నారు. ఇలా రూ. 20వేల నుంచి రూ. లక్ష వరకు బయట బాకీలకు తెస్తున్నారు.

సర్కారు ఆలస్యంతోనే..

అసెంబ్లీ ఎన్నికల్లో రైతు రుణమాఫీపై కాంగ్రెస్ విస్తృత ప్రచారం నిర్వహించింది. డిసెంబర్ 7న అధికారం చేపడుతామని, 9న రుణమాఫీ చేస్తామని, అందరూ రుణాలు తీసుకోవాలని చెప్పుకొచ్చింది. కానీ అధికారంలోకి వచ్చాక 9వ తేదీన రుణమాఫీ చేయలేదు. ఆఖరికి ఏడు నెలల తర్వాత రుణమాఫీకి చర్యలు తీసుకుంది. ఈ ఏడు నెలల్లో రైతుల రుణాలకు వడ్డీ పెరుగుతూనే వస్తున్నది. అప్పుడే మాఫీ చేస్తే మిత్తీ కట్టాల్సిన అవసరం ఉండకపోయేది. అంతే కాకుండా అనేక మంది రైతులు అసలు, వడ్డీతో కలిపి ఇప్పుడు రెండు లక్షలు దాటింది. దీంతో పైన డబ్బులు కడితేనే మాఫీ చేస్తామనడంతో మాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారు.

గ్రీవెన్స్‌కు 1,074 దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కాని వారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసింది. మండలాల్లో వ్యవసాయ అధికారులకు రైతుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 1,074 అప్లికేషన్లు వచ్చాయి. ఇందులో 45 నో డేటా ఫౌండ్, 89 పట్టాదారు పాసు పుస్తకాలు, 16 బ్యాంక్, 144 పేర్లు కలువకపోవడం, 11 ఆధార్ కార్డు, 42 డెబిట్, 308 కుటుంబ, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి.

అప్పు తెచ్చి బ్యాంకులో కట్టిన..

నాకు మూడు ఎకరాల భూమి ఉంది . మూడు సంవత్సరాల క్రితం పోచంపల్లి ఏపీజీవీబీ బ్యాంకులో రెండు లక్షల రూపాయల క్రాప్ లోన్ తీసుకున్న. 33 వేల రూపాయలు వడ్డీ అయ్యింది. కాంగ్రెస్ గవర్నమెంట్ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది. జాబితాలో నా పేరు రాలేదు. రెండు లక్షలకు పైగా ఉంటే రుణమాఫీ కాదట. అప్పు తెచ్చి రూ. 33 వేలు బ్యాంకులో కట్టాను. రుణ మాఫీ పేరిట నిబంధనల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నది. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. అర్హులందరికీ రుణమాఫీ చేయాలి.

- ఆకుల రామచంద్రం, మెహర్ నగర్, భూదాన్ పోచంపల్లి

20 వేలు వడ్డీ కట్టిన.. ఇప్పడన్నా అవుతదో.. లేదో!

ప్రభుత్వం రూ. 2లక్షల పైగా క్రాప్‌లోన్ ఉన్నోళ్లకు రుణమాఫీ చేయలేదు. నా పేరు, నా భార్య పేరుపై రెండు లక్షల 5వేల రుణం ఉన్నది. దానికి వడ్డీ 20వేలు కాగా మొత్తం 2లక్షల 25 వేలు అయ్యింది. మూడో జాబితాలో మా పేర్లు రాకపోవడంతో వ్యవసాయాధికారులను సంప్రదించాం. 2లక్షల పైన ఉన్న డబ్బులను చెల్లిస్తే రుణ మాఫీ అవుతుందని చెప్పారు. బ్యాంకు వెళ్లి 28వేలు చెల్లించిన. ఇప్పుడు లక్షా 97వేల రుణం ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఇప్పుడన్నా అవుతదో, కాదో. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేస్తున్నది. కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాలి.

-బుగ్గ నాగరాజు, రైతు, మోటకొండూర్

నెలలు గడుస్తున్నా రుణమాఫీ కాలే

ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బంది పెడుతున్నది. కొర్రీలు పెట్టి అందరికీ ఇవ్వడం లేదు. అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా చేయడం లేదు. నేను చందుపట్ల పీఏసీఎస్‌లో 1,28 లక్షల రుణం తీసుకున్నా. కానీ నాకు రుణమాఫీ కాలే. అధికారులు, బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాన్నా.

- గొర్ల వైకుంఠం, రైతు, ఎర్రంబల్లి, భువనగిరి మండలం

హైదరాబాద్‌లో డీజీపీకి వినతి పత్రం ఇచ్చి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టాలి

- ఉమ్మడి జిల్లా నేతల భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తిరుమలగిరిలో కాంగ్రెస్ మూకదాడిపై డీజీపీని కలిసి ఫిర్యాదు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో వచ్చిన నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం చేపట్టిన రైతు రుణమాఫీ ధర్నాలపై ఆరా తీశారు. ప్రజలు, రైతుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరిలో కాంగ్రెస్ కార్యకర్తల దౌర్జన్య కాండపైనా చర్చించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అక్కడ జరిగిన దాడి తాలుకా విషయాలను వివరించినట్లు తెలిసింది. కేటీఆర్ స్పందిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు చేస్తున్న అరాచకాలను ఎక్కడికక్కడ ఎండ గట్టాలని సూచించారు.

పార్టీ నేతలంతా సమన్వయంతో కలిసికట్టుగా పని చేస్తూ కాంగ్రెస్ దాడులను, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాల దాడి, పోలీసులు పక్షపాత ధోరణిపై కేటీఆర్‌తో కలిసి జిల్లా నేతలు డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, నోముల భగత్‌కుమార్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ దాడిపై విచారణ సజావుగా జరిగేనా?

- 50మందికిపైగా దాడికి దిగితే ఆరుగురిపైనే కేసు నమోదు
- బీఆర్ఎస్ నాయకులపైనా కేసులు
- టెంట్లు కూల్చిన పోలీసులను రక్షించే యత్నం?

సూర్యాపేట, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : రైతులందరికీ రుణమాఫీ చేయాలని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి బీఆర్ఎస్ తలపెట్టిన రైతు ధర్నా శిబిరంపై కాంగ్రెస్ మూకలు చేసిన దాడిపై విచారణ సజావుగా సాగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం కాంగ్రెస్ గూండాలు దాడికి దిగిన ఘటనలో పోలీసుల పాత్ర కూడా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. కాంగ్రెస్ శ్రేణులు రాళ్లు, గుడ్లు విసురుతూ దాడికి పాల్పడుతుండగా వారిని నివారించకపోగా పోలీసులే బీఆర్ఎస్ దీక్షా శిబిరం టెంట్లను కూల్చివేయడం విస్మగొల్పుతున్నది.

తిరుమలగిరిలో బీఆర్ఎస్ దీక్షా శిబిరంపై కాంగ్రెస్ చేసిన దాడితో పదేండ్లపాటు ప్రశాంతంగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం ఉలిక్కిపడింది. ప్రధానంగా దాడులకు పాల్పడే వారికి పోలీసుల సహకారం ఉందని తెలుస్తుండడంతో భవిష్యత్ ఎలా ఉంటుందోననే భయాందోళనలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పాలనలో గత పదేండ్లలో గాదరి కిశోర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక్క దాడి కూడా లేకపోగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఇలాంటి దారుణాలు జరుగడంపై జనం చర్చించుకుంటున్నారు. సొంత పార్టీ నేతలే ఇసుక మాఫియా, కాంట్రాక్ట్ మాఫియా అంటూ స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు ఎనిమిది నెలల కాలంలో బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. దీక్షా శిబిరంపై దాడికి పాల్పడే వారికి సహకారం అందించిన పోలీసులు బాధితులకు ఎలా న్యాయం చేస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ దాడులను ప్రోత్సహిస్తూ టెంట్లు కూల్చిన పోలీసులను రక్షించేందుకు కాంగ్రెస్ నియోజకవర్గ బాస్ రాష్ట్ర పెద్దలతో ఒత్తిడి తెస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, నిన్నటి ఘటనకు సంబంధించి ఇరు వర్గాలు ఫిర్యాదులు చేయగా.. కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు పోలీసులు కేసులు నమోదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు చెప్తున్నారు. దాడికి దిగిన కాంగ్రెస్ గుంపులో దాదాపు 50మందికిపైనే ఉంటే కేవలం ఆరుగురిపై కేసు నమోదు చేయడం పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డీసీపీ రాజేశ్‌చంద్రకు వినతి పత్రం అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై కేసు నమోదు చేయాలి

- దేవాలయం మాఢ వీధులు శుభ్రం చేయడం శాసన సభ్యులను అవమానించినట్లే
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఆగస్టు 23 : దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, పవిత్ర యాదగిరి గుట్ట దేవాలయం మాఢ వీధుల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బృందం రాజకీయపరమైన శుద్ధి కార్యక్రమం చేసినందుకు చట్టపరమైన కేసులు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం భువనగిరిలో డీసీపీ రాజేశ్‌చంద్రకు డీసీపీ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసన సభ ఎన్నికల సమయంలో భువనగిరిలో జరిగిన ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆగస్టు 15లోపు రైతులు బ్యాంకుల్లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి లక్ష్మీనర్సింహ స్వామిపై ఒట్టు వేశాడని అన్నారు. ఆయన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రాష్ట్రంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరుగలేదని, దేవుడిపై వేసిన ఒట్టు ప్రకారం మాట తప్పాడని, దాంతో పాలకులు చేసే తప్పిదాలకు ప్రజలకు నష్టం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరుగలేదని రాష్ట్ర మంత్రులే చెబుతున్నారని, వారు చెప్పే మాటలు ఒకరికి ఒకరికి పొంతనలేని విధంగా ఉన్నాయని, మొత్తం రుణమాఫీకి రూ.46వేల కోట్లు కావాల్సి ఉండగా మూడు విడుతల్లో రూ.18 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని, పూర్తి స్థాయిలో ఎక్కడ జరిగిందో చెప్పాలని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుతోపాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు, ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్మీనర్సింహ స్వామికి ఇచ్చిన మాట తప్పాడని, దాంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలపెట్టవద్దని లక్ష్మీనర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు చేయించి వేడుకున్నామని, దేవుడిని వేడుకోవడం తప్పా అని తెలిపారు. దేవుడిని దర్శించుకోవడం, మాఢ వీధుల్లో తిరుగడం తప్పని, అదేరోజు సాయంత్రం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నడిచిన ప్రాంతంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు యాదగిరిగుట్ట మండల, పట్టణానికి చెందిన మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, ఆ పార్టీ నాయకులు ఎరుకల హేమేందర్‌గౌడ్, గౌళి కార్ రాజేశ్, కాటబత్తిని ఆంజనేయులు, దుంబాల వెంకట్‌రెడ్డి, గుండు నర్సింహగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, గుడిపాటి మధుసూన్‌రెడ్డి కొండ కింది భాగం నుంచి 5 ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను యాదాద్రి కొండపైకి దేవస్థానం అనుమతులు లేకుండా తీసుకొచ్చారని తెలిపారు. కొండపైన రాజకీయపరమైన శుద్ధి కార్యక్రమం చేపట్టారని అన్నారు. ప్రైవేట్ వాహనాలు కొండపైకి రావాలంటే రూ.500 వందల టికెట్ తీసుకుంటారని, కానీ ఎలాంటి అనుమతి లేకుండా, రుసుం చెల్లించకుండా కొండపైకి వాటర్ ట్యాంకర్లను ఈఓ ఎలా పైకి అనుమతించారని తెలిపారు. ఆలయ నిబంధనల ప్రకారం సూర్య, చంద్రగహణాలు పట్టినప్పుడు, ఆలయ పరిసరాల్లో అపశ్రుతి సంభవించినప్పుడు మాత్రమే శుద్ధి కార్యక్రమం చేస్తారని, అది కూడా అర్చకుల పూజలతో ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం దేవాయల సిబ్బంది చేపడుతారని చెప్పారు. దేవాలయ పరిసరాల్లో రాజకీయ కార్యక్రమాలు చేపట్టడం వల్ల కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ చట్ట ప్రకారం సెక్షన్ 192, 352, 353 బీఎన్ఎస్ సెక్షన్లతో వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతునామని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, చొల్లేరు మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి తదితరులున్నారు.

భూ రికార్డుల క్రమబద్ధీకరణపై నేడు ప్రత్యేక సమావేశం

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 23 : భూ రికార్డుల క్రమబద్ధీకరణ, నూతన ప్రతిపాదిత ఆర్ఓఆర్ ముసాయిదా చట్టంపై విలువైన సలహాలు, సూచనల కోసం శనివారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సపమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె. జెండగే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, ప్రస్తుత రెవెన్యూ అధికారులు, భూమి విషయాలపై పని చేస్తున్న ఎన్‌జీఓలు, ఆసక్తి ఉన్న పౌరులు హాజరై సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు.

వట్టికోట వారసత్వంతోనే గ్రామాగ్రామన గ్రంథాలయాలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్

రామగిరి, ఆగస్టు 23 : వట్టికోట అళ్వారు స్వామి వారసత్వంతో గ్రామాగ్రామాన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి నల్లగొండ జిల్లాలోనే జరిగిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అన్నారు. నల్లగొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో వసతులు, పాఠకుల సౌకర్యాలు, ఆడిటోరియం తదితర అంశాలను పరిశీలించారు. అలాగే కేంద్ర గ్రంథాలయంలో చదివి వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడి, అదనపు కలెక్టర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి టి.పూర్ణచందర్‌తో కలిసి వారిని సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రంథాలయ పాత్ర విశిష్టమైందన్నారు. గ్రంథాలయ నిర్వహణలో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర గ్రంథాలయాశాఖ సంచాలకుడు ఏవీఎన్‌రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్, కట్టా నాగయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు ఏమైంది?

ఎన్నికల్లో రైతులను మభ్య పెట్టి.. ఓట్లు దండుకుండ్రు

- ఇప్పుడు అడిగితే పట్టించుకోకుండా ముఖం చాటేస్తుండ్రు
- తిరుమగిరిలో కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నం
- గుట్టలో మాఢవీధుల శుద్ధి ఎంత వరకు కరెక్ట్?
- అర్హులకు రుణమాఫీ అయ్యేదాకా కొట్లాడుతాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతల వెంకటేశ్వర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించిందని, అసలు అలైన్‌మెంట్ మార్చే దమ్ముందా.. లేదా..? అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. నాడు ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి రైతులను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని, ఇప్పుడు పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. భువనగిరి మండలంలోని అనంతారంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమలగిరిలో సంపూర్ణ రైతు రుణ మాఫీ కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులపై దాడి చేస్తున్నప్పుడు అడ్డుకొని.. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి పర్యటించడంపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ నేతలు ఆలయ మాఢ వీధులను శుద్ధి చేయడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీశారు.

సర్కారు మెడలు వంచైనా మాఫీ చేయిస్తం..

రైతు రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చింతల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. సర్కారు మెడలు వంచి రైతులకు రూ. రెండు లక్షలు మాఫీ చేసే వరకూ బీఆర్ఎస్ కొట్లాడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కష్టాలు మొదలయ్యాయని మండిపడ్డారు. రైతు పెట్టుబడికి రైతుబంధు రాక, వ్యవసాయానికి సక్రమంగా కరెంట్ లేక, పంటకు రూ. 500 బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నదని